క్లుప్తంగా

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి

ఆత్మకూరు: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి ఆదివారం నూతన ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శ్రీ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరస్వామి రచించిన తెలుగు క్యాలెండర్‌తో పాటు త్రైత సిద్ధాంత గ్రంథం ఆవిష్కరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సరళమైన భాషలో ప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా భగవద్గీత వచనాలు ఉన్నాయని, తెలుగు పండుగల విశిష్టతను పొందుపరచడం అభినందనీయమన్నారు. ప్రబోధసేవా సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మునిస్వామి, సంజీవ, భాస్కర్, మద్దిలేటి, స్వర్ణ, వరాలు, రవణమ్మ పాల్గొన్నారు.

కాలినడక భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దివ్యాంగులు

నందికొట్కూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని కర్ణాటక భక్తులు ఎండను సైతం లెక్క చేయకుండా కాలినడకన శ్రీశైలం వెళుతున్నారు. వారికి దివ్యాంగుల సంక్షేమ సఃగం జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి నాగన్న, సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు.

చదువుకు వయస్సుతో పనిలేదు



మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తున్న వెంకటేశ్వర్లు

వెలుగోడు: చదువుకోవడానికి వయస్సుతో సంబంధం లేదని, చదువు వల్ల జ్ఞానం పెరుగుతుందని, సమాజంలో జరుగుతున్న రుగ్మతలను అర్థం చేసుకొని జీవనం సాగించగలరని వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సీపీ నగర్‌లోని వయోజన విద్యా పరీక్ష కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ..మహిళలను సంపూర్ణ అక్షరాసులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వయోజన విద్యా శిక్షకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిల్లా నోడల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి, వెలుగు సీసీ పాల్ పాల్గొన్నారు.

వయోజనుల పరీక్షకు 746 మంది హాజరు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఏపీఎం

జూపాడుబంగ్లా: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పరీక్షలో 746 మంది పరీక్ష రాసినట్లు ఏపీఎం అంబమ్మ తెలిపారు. 12 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 16 పరీక్ష కేంద్రాల్లో 781 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 35 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి మూడు విభాగాల్లో 150 ప్రశ్నలతో కూడిన పరీక్షలు నిర్వహించారు.

మహానందిలో గ్రీన్ మ్యాట్లు



మహానంది ఆవరణలో గ్రీన్‌మ్యాట్లు వేసిన దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో గ్రీన్‌మ్యాట్లు వేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నంద్యాలకు చెందిన ఏజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, అరవింద ప్రసాద్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ మోహన్‌రెడ్డి, బాలకృష్ణ సహకారంతో వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల కాళ్లు కాలకుండా మ్యాట్లు పరిచినట్లు చెప్పారు. ఈ మేరకు దాతలకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

భక్తులకు వైద్య సేవలు

ఆత్మకూరు: శ్రీశైలం మహాక్షేత్రానికి కాలినడకన తరలివెళ్తున్న కర్ణాటక భక్తులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యసేవలు అందించడం సంతృప్తినిస్తుందని కర్నూలు రెడ్‌క్రాస్ చైర్మన్ గోవిందరెడ్డి, నంద్యాల రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు సలాం, ఉపాధ్యక్షులు కురుకుంద వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కరివేన గ్రామ సమీపంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

శరభ శరభ.. భద్ర!

- కన్నడ, మహారాష్ట్రీయులకు ఆరాధ్యదైవం నాగలూటి వీరభద్రస్వామి
- తొలిమొక్కులు వీరభద్రునికే, అనంతరమే మల్లన్న దర్శనం



నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం



వెంకటాపురం నుంచి నాగలూటి క్షేత్రానికి వెళ్తున్న కర్ణాటక భక్తులు

ఆత్మకూరు: కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు లక్షలాదిగా ఉగాది పర్వదినం సందర్భంగా తమ ఆడబిడ్డను దర్శించుకునేందుకు కాలినడన తరలి రావడం అనాదిగా కొనసాగుతోంది. కాలినడకన శ్రీగిరి చేరుకునే క్రమంలో తమ ఆరాధ్య దైవమైన నాగలూటి వీరభద్ర స్వామికి తొలిమొక్కులు సమర్పిస్తారు. పాదయాత్రగా వెళ్లే భక్తులు నల్లమల కొండ అంచులో వెలసిన నాగలూటి క్షేత్రంలో కొలువుదీరిన వీరభద్రస్వామిని దర్శించుకొని దీపారాధన చేస్తారు.

రక్షగా..వీరభద్రుడు..

పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే భక్తులు వీరభద్ర స్వామిని దర్శించుకుంటే కొండ కోనల్లో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సురక్షితంగా మల్లన్న సన్నధి చేర్చే బాధ్యతను వీరభద్రుడు తీసుకుంటాడని భక్తుల నమ్మకం. కొన్నేళ్ల క్రితం వరకు రవాణా మార్గాలు లేకపోవడంతో కాలినడకన వెళ్లేవారు. ప్రస్తుతం వాహనాల్లో వెళ్లేవారు. ముందుగా నాగలూటిలోని స్వామి వారిని దర్శించుకొని కొండకు బయలుదేరుతారు.



క్షేత్రంలో వెలిసిన శ్రీ వీరభద్రస్వామి

అనాదిగా వస్తున్న ఆచారం



మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. కర్ణాటక నుంచి కాలినడకన ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు మా ఆడపడుచు శ్రీ భ్రమరాంబ, మల్లన్న స్వామి వార్లకు దర్శనానికి బయలుదేరేముందు వీరభద్ర స్వామి వారిని స్మరించుకుని తొలి అడుగులు వేస్తాం. నాగలూటి చేరుకునేందుకు ఎంతగానో ఇష్టపడతాం. అక్కడ వెలిసిన శ్రీ వీరభద్రస్వామి వారిని కనులారా దర్శించి మొక్కులు చెల్లిస్తాం. ఇది మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

– శ్రీమత్‌గారి గౌర, ముద్దాపూర్, బాగల్‌కోట జిల్లా, కర్ణాటక రాష్ట్రం

మా ఇలవేల్పు వీరభద్రస్వామి



మా ఇంటి ఇలవేల్పు వీరభద్ర స్వామి. స్వామివారి దర్శనం కోసం తహతహలాడుతాం. ప్రతియేటా కర్ణాటక రాష్ట్రం నుంచి బయలుదేరి నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రానికి చేరుకుంటాం. ఇంటి నుంచి తెచ్చుకున్న టెంకాయలు, పూజా సామగ్రిని స్వామివారికి సమర్పించి ఆయన దర్శనానంతరం నల్లమల కొండ అంచుల్లో మెట్లకు కుంకుమ, పసుపు రాసి కాయా కర్పూరం ముందుకెళ్తాం.

– గుండయ్య, బళ్లారి పట్టణం, కర్ణాటక రాష్ట్రం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

నేడు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పాములపాడు: అంగన్‌వాడీ టీచర్లు సోమవారం నిర్వహించనున్న శిక్షణా తరగతులకు హాజరుకావాలని సూపర్‌వైజర్ లలిత ప్రభావతి తెలిపారు. మండలంలోని తుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లకు పౌష్టికాహారం, సులభరీతిలో విద్యాబోధనపై అవగాహన కల్పిస్తామన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం దేశంలో కార్మికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులు, రైతులకు ఇబ్బందులు కల్పించే చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. రణధీర్, మంజుల, నూర్‌అహ్మద్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం



రింగ్‌పార్క్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: స్వాతంత్ర్య సంగ్రామంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆశయాలను ప్రతిఒక్కరూ సాధించాలని సీపీఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభను నిర్వహించి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. శివుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

- **శ్రీశైలంప్రాజెక్ట్:** స్వాతంత్ర్య పోరాటయోధుడు భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం సున్నిపెంటలో నిర్వహించారు. ఏఐవైఎఫ్ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించగా, రింగ్ పార్క్ సెంటర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి కార్మి సంఘాల నాయకులు నివాళులర్పించారు.నాయకులు వై.ఆశీర్వాదం, వై.శ్రీను,పి.మల్లికార్జున పాల్గొన్నారు.
- **బండి ఆత్మకూరు:** మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కాగడాలతో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

నందికొట్కూరు: భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ(ఐక్య) జిల్లా కన్వీనర్ లాజరస్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కాగడాలతో ఎంసీపీఐ(యూ) నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు దక్క చిన్నకుమార్, మద్రిస్వామి, శ్రీనివాసులు, చెన్నయ్య, చింటూ, వినోద్, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో అందరూ బదిలీ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏలు, సీఓలు బదిలీ కాగా వారి స్థానంలో కొత్తవారు వచ్చారు. ఏపీఓ గౌరీబాయి రుద్రవరం మండలానికి బదిలీ కాగా ఆమె స్థానంలో బనగానపల్లె నుంచి రేష్మ ఏపీఓగా వచ్చారు. ఈసీ నజీర్‌బాషా గడివేములకు బదిలీ కాగా ఆయన స్థానంలో బనగానపల్లె నుంచి మగ్బుల్ వచ్చారు. టీఏలు చిన్న నందికొట్కూరు, సబిత, ఇజ్రాయిల్ మిడ్తూరు, శివకుమారి, వెంకటేశ్వరమ్మ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తపల్లి నుంచి కిరణ్, ఓబులమ్మ, మిడ్తూరు నుంచి రాములమ్మ, నందికొట్కూరు నుంచి కవిత బదిలీపై జూపాడుబంగ్లాకు వచ్చారు. వీరితో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు బదిలీ అయ్యారు.

నివాళి



సుధాకర్ రెడ్డి మృత దేహానికి నివాళులర్పిస్తున్న శిల్పా భువనేశ్వర రెడ్డి

బండి ఆత్మకూరు: టీడీపీ మద్దతుదారుల చేతిలో దారుణ హత్యకు గురైన లింగాపురం గ్రామానికి చెందిన నంద్యాల సుధాకర్ రెడ్డి మృతదేహానికి ఆదివారం శ్రీ శైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, బోధనం సర్పంచ్ బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, నారాయణాపురం విష్ణు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



గర్భగుడిలోని వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణాజలాల నుంచి పూర్తిగా బయటపడడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సప్తనదుల సంగమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు వందలాదిగా తరలివచ్చి వేపదారు శివలింగాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మరబోట్లపై ప్రయాణం నిషేధించినప్పటికీ తెలంగాణ ప్రాంతానికి చెందిన మరబోట్ల నిర్వాహకులు అధికసంఖ్యలో బోట్లపై భక్తులను ఎక్కించుకుని విచ్చలవిడిగా అవలి ఒడ్డునుంచి సంగమేశ్వరం వద్దకు తిప్పుతున్నారు. ఆంధ్రప్రాంతంలో మరబోట్ల నిషేధం ఉన్నప్పటికీ బిలంకాంధమ్మ గుడి సమీపంలో మరబోట్లపై వచ్చిన భక్తులు సుమారు కిలోమీటరు మేర అవస్థలు పడుతూ సంగమేశ్వరుని దర్శనానికి వస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై యువతకు శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పూర్తి చేసిన యువకులు, రైతులు

నందికొట్కూరు: ప్రకృతి వ్యవసాయంపై యువతకు, రైతులకు ఇచ్చిన శిక్షణను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని స్టేట్ కోఆర్డినేటర్ సాయి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్‌ఎఫ్‌సీ కో ఆర్డినేటర్ స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఇచ్చిన మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గ చూపాలన్నారు. వీటితో అనేక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఈ విధానం ద్వారా పంటలు పండిస్తే ప్రజలను రోగాల బారినపడకుండా కాపాడినట్లేనన్నారు. రసాయన ఎరువుల ద్వారా పండించిన పంటలు ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రాణాంతకమైన రోగాలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ సిండికేట్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి కల్పన సంస్థ అధికారులు రమాదేవి, రవిచందర్, నంద్యాల, కర్నూలు ప్రకృతి వ్యవసాయదారులు పాల్గొన్నారు.

ప్రాతకోటలో పోలీసుల సోదాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున స్పెషల్ పార్టీ బలగాలతో కార్డన్ సెర్చ్ చేపట్టారు. గ్రామ పురవీధుల మీదుగా కవాతు నిర్వహిస్తూ అనుమానితులు, బెల్టుదుకాణ నిర్వాహకులు, సస్పెక్ట్ షీటర్స్ ఇళ్లల్లో తనిఖీలు చేశారు. సోదాల్లో బెల్టు దుకాణదారుడు పలుచాని మహేశ్వరరెడ్డి ఇంటిలో 8 లిక్కర్ బాటిల్స్ లభ్యం కాగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. అనంతరం ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ.. ప్రాతకోట గ్రామం ఫ్యాక్షన్ జోన్ 4 గ్రామంగా పోలీసుల రికార్డుల్లో ఉన్నందున చట్టాన్ని అతిక్రమించరాదని హెచ్చరించారు. చిన్న తగాదాలు పెట్టుకుని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అలాగే నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా శిక్షార్హులవుతారని తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యమన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని కోరారు. చట్టవ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా వదిలే ప్రసక్తి లేదన్నారు. ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం సందర్శన



శ్రీశైలం డ్యాం వద్ద డైరెక్టర్ మోహన్‌రావు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయాన్ని ఆదివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మోహనరావు సందర్శించారు. ముందుగా ఆయన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సున్నిపెంటలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆ తర్వాత శ్రీశైలం డ్యాంను సందర్శించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు, సబ్‌ట్రెజరీ అధికారి వెంకటరమణ, డ్యాం మెయింటనెన్స్ డివిజన్ సూపరింటెండెంట్ వి.లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ జి.ప్రకాష్ తదితరులు ఉన్నారు.

26న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని పలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 29 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జగనన్న కాలనీ, మారుతీనగర్, విలేకరి కాలనీ, బీఎస్ఆర్ నగర్, బీఆర్ఆర్ నగర్, వాల్మీకి నగర్, కుమ్మరిపేట, సీఎస్ఐ పాలెంలో సమస్యలు తిష్టవేశాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక వర్షాకాలంలో మురుగు నీరు ఇళ్లలోకి చేరుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని విమర్శించారు. రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, మధుబాబు, గోకారి, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.



రహదారి వెంట శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులు

'భక్తి'మార్గం

పాములపాడు: శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ అమ్మవారి దర్శనార్థం కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులతో రహదారి కిటకిట లాడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వడివడిగా నడుస్తూ, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మధ్యాహ్నం నీడ ఉన్న ప్రాంతాల్లో సేదతీరుతూ నడక సాగిస్తున్నారు. పాదయాత్రికులకు మండలంలోని క్రిష్ణారావుపేట, జూటూరు, బానుముక్కల మలుపు వద్ద అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీలను స్థానికులు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన కొందరు, మొక్కులున్న వారు చెక్కలను కాళ్లకు కట్టుకుని నడుస్తూ భక్తిని చాటుకుంటున్నారు. వీరంతా వెంకటాపురం వరకు రహదారి వెంట వెళ్తూ అక్కడి నుంచి అటవీ మార్గం మీదుగా శ్రీగిరిని చేరుకుంటారు.

శ్రీశైలంలో భారీ వర్షం



శ్రీశైలంలో వర్షంలో వెళ్తున్న భక్తులు

శ్రీశైలం: క్షేత్రం ఆదివారం సాయంత్రం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్డు పక్కనుండే చిరువ్యాపారులు, భక్తులు ఇబ్బందులు పడ్డారు.కొందరు చిరువ్యాపారుల సామగ్రి కొట్టుకుపోయాయి. కాగా.. కొద్ది రోజుల నుంచి ఎండతీవ్రతతో అల్లాడిన జనం వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

కల్వరికొండ రహదారి సమస్యను పరిష్కరిస్తాం



దారిని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: రెవెన్యూ రికార్డుల ప్రకారం కల్వరి కొండ రహదారి సమస్యను పరిష్కరిస్తామని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మిడుతూరు మండలం మాసాపేట పొలిమేరలోని దిగువపాడు కల్వరికొండ స్థలంలో పొలాలకు వెళ్లేందుకు రహదారి ఉందని దిగువపాడు రైతుల, క్రైస్తవుల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయం రూరల్ సీఐ, ఎస్‌ఐలు ఓబులేసు దృష్టికి వెళ్లింది. దీంతో రూరల్ సీఐ, ఎస్‌ఐలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వరికొండ రహదారి సమస్యపై ఇరువర్గాలు ఎలాంటి గొడవలకు దారీ తీయకుండా సామరస్యంగా పరిష్కార మార్గంలో ముందుకు వెళ్లాలని సూచించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరువురికి హెచ్చరించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం పరిష్కారం చూపుతామని తెలిపారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు ఉన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి



మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి, ఉగాది సమీపిస్తున్న నేపథ్యంలో కర్ణాటక భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

వేడుకగా మహానందీశుడి కల్యాణం



మహానందీశుడి ఉత్సవ మూర్తులు

మహానంది: క్షేత్రంలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం నిత్య కల్యాణోత్సవంలో భాగంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు స్థానిక అలంకార మండపంలో కల్యాణోత్సవాన్ని శాస్త్రయుక్తంగా జరిపించారు. రాత్రి స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ పూజలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జాం



శ్రీశైలం రోడ్డు మార్గంలో బారులుదీరిన వాహనాలు

శ్రీశైలం: ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భారీ సంఖ్యలో వాహనాలు తరలిరావడంతో అటు తెలంగాణ నుంచి వచ్చే ఘాట్ రోడ్ లోనూ ఇటు దోర్నాల నుంచి వచ్చే ఘాట్ రోడ్ లోనూ వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వేల సంఖ్యలో వాహనాలు తరలివస్తుండడంతో, శిఖరేశ్వరం నుంచి సాక్షి గణపతి, దేవస్థానం టోల్గేట్ వరకు, అలాగే శ్రీశైలం డ్యాం నుంచి ముఖద్వారం వరకు సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. కేవలం సింధుపెంట నుంచి శ్రీశైలం రావడానికి గంటపాటు సమయం పడుతోంది. ప్రత్యేక విధులపై వచ్చే పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది శ్రీశైలం రావడానికి మరో రెండు మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. అంతవరకు ప్రయాణికులకు అవస్థలు తప్పకపోవచ్చు.